రైల్వే వంతెన పనుల పరిశీలన



రైల్వే వంతెన పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వంతెన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, నాయకులు జంగయ్యయాదవ్, ప్రభాకర్ రెడ్డి, నాగరాజుముదిరాజ్ పాల్గొన్నారు.

గురుకుల్‌లో అదనపు తరగతి గదికి భూమిపూజ

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ జూనియర్ కళాశాలలో దయానో కంపెనీ యజమాని రాజు రూ.10 లక్షల విరాళాలతో చేపట్టిన అదనపు తరగతి గది నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శశికళ, మాజీ సర్పంచ్‌లు యాదగిరియాదవ్, వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ యాదగిరియాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, రాంరెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చిత్తారియాదవ్, ఆంజనేయులు, శశిధరన్, భూషణంచారి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

31న జోనల్ స్థాయి క్రికెట్ సెలక్షన్స్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, మేడిపల్లి మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల జోనల్ స్థాయి క్రికెట్ సెలక్షన్స్ ఈ నెల 31న వెంకటాపూర్‌లోని బ్యాట్ అండ్ బాల్ అకాడమీలో నిర్వహించనున్నట్లు జోన్ కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. అండర్ 14, 17లోపు బాలురు సెలక్షన్స్‌లో 14 ఏళ్లలోపు బాలురు జనవరి 1, 2011 తర్వాత జన్మించినవారు, 17 ఏళ్లలోపు జనవరి 1, 2008 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ప్రతి పాఠశాల నుంచి 14 ఏళ్లవారు 5 మంది, 17 ఏళ్ల వారు 5 మంది మించొద్దని పేర్కొన్నారు. క్రీడాకారులు సొంత క్రికెట్ కిట్‌తోపాటు ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఈ నెల 31న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 96405 01084, 92913 03090 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

డబీల్‌పూర్ పాఠశాలలో భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న నేతలు

మేడ్చల్: మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఓస్పాట్ సంస్థ పాఠశాల ఆవరణలో ఐదు గదుల నిర్మాణానికి ముందుకు వచ్చింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజితరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, గీత భాగ్యారెడ్డి, సంజీవరావు, నాయకులు గౌస్, సత్యనారయణ, భాగ్యారెడ్డి, అశోక్ ముదిరాజ్ ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోచారం పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన సీపీ

పోచారం: పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం పరిశీలించారు. స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పరిసరాలతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. సమస్యాత్మక ప్రాంతాల పట్ల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

లక్ష్యసాధనతోపాటు బాధ్యతలు నిర్వర్తించాలి


- విద్యార్థులకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచన



శ్రీనిధి కళాశాల ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

పోచారం: విద్యార్థులు లక్ష్య సాధనతోపాటు సమాజంపట్ల ఎలాంటి బాధ్యతలు నిర్వర్తించాలనే విషయాలపైనా దృష్టి సారించాలని రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.సుధీర్‌బాబు అన్నారు. బుధవారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్‌లో కొత్తగా చేరిన విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ (పరిచయ) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇంటర్ తర్వాత బీటెక్‌లో చేరగానే ఎంతో స్వేచ్ఛ వచ్చినట్లు విద్యార్థులు భావిస్తారని, కానీ, ఫస్టియరే విద్యార్థుల భవితను నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. సిగరెట్లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ కె.అభిత్‌రావు, ప్రిన్సిపాల్ డా.టీసీహెచ్ శివారెడ్డి, డీన్ కొండయ్య, పూర్వ ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, హెచ్‌ఓడీలు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

నేడు వాలీబాల్ టోర్నమెంట్



మేడ్చల్ సీఐ సత్యనారాయణ

మేడ్చల్‌రూరల్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా నేడు(గురువారం) మేడ్చల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టోర్నీని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. టోర్నీలో మేడ్చల్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల యువకులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.



సర్వే చేస్తున్న వైద్య శాఖ సిబ్బంది..



డెంగీ.. డేంజర్ బెల్స్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో 394 డెంగీ కేసులు

- మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాల్లోనే అధికం
- 30 రోజుల వ్యవధిలో బస్తీ, పట్టణాల్లో 232 కేసులు
- ఫీవర్ సర్వేలో వైద్యశాఖ గుర్తించిన జ్వర పీడితులు 8,742 మంది

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డెంగీ డేంజర్ బెల్ మోగిస్తోంది. జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, పురపాలక సంఘాలు, బస్తీల్లో దోమల బాధలు భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారుల్లో చాపకింద నీరులా డెంగీ విజృంభిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 394 డెంగీ కేసులు నమోదు కాగా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, విషజ్వరాలకు సంబంధించిన కేసులు స్వల్పంగా నమోదయ్యాయి. వర్షాలతో దోమలు విజృంభిస్తుండటంతో డెంగీ కేసులు పెరుగుతున్నట్లు పేర్కొంటున్నారు. పల్లెల్లో మాత్రం విషజ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు వంటి జబ్బులు పెరుగుతున్నాయి. బస్తీలు, పురపాలికలు, పల్లెల్లో బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు లభించకపోవడంతో నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరిగెడుతున్నారు. పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జిల్లాలో జులై చివరి వారం నుంచి ఇప్పటి వరకు 232 డెంగ్యూ కేసులు నమోదు కావడంతో.. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ మండలం రావల్‌కోల్‌లో 40 రోజుల కిందట ఒక వ్యక్తి డెంగ్యూతో మృతి చెందడంతో పల్లెల్లో దోమల నివారణ, పరిశుభ్రతపై జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది.

జ్వర పీడితులు 8,742 మంది..

మేడ్చల్ జిల్లాలో 15 మండలాల పరిధిలో జులై 5 నుంచి బుధవారం వరకు ఇంటింటి ఫీవర్ సర్వేలో భాగంగా 3,71,514 ఇళ్లను విజిట్ చేసిన వైద్య సిబ్బంది.. ఇందులో 13,37,450 మంది నుంచి రోగ నిర్ధారణ వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలోనే 8,742 మంది ప్రజలు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించటంతో పాటు వారికి మందులు(మెడిసిన్) అందజేశారు. ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ సిబ్బంది వ్యాధుల కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వాతావరణ మార్పులతో..

ఒక రోజులోనే ఎండ కాయడం, కొన్ని గంటలకు వర్షం కురవడం, మరికాసేపటికే చల్లని గాలులు వీయడం వంటివి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒంట్లో రోగ నిరోధకశక్తి తక్కువ ఉన్న వారు త్వరగా వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పోషకాహారం తీసుకుంటూ సరైన శారీరక వ్యాయామం చేసే వారు మాత్రం వీటిని ఎదుర్కొంటున్నారు. వ్యాధి బారిన పడిన వారిలో సగం మంది జ్వరం, గొంతు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు.

దోమల నియంత్రణపై..

జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడంతో బస్తీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. దోమల నియంత్రణకు ఫాగింగ్ వంటి చర్యలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయొద్దు



జిల్లాలో జ్వరాలకు సంబంధించిన మందులు అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వచ్చినట్లు అనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలి. అవసరమైతే డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. జ్వరమే కదా అని ఇంట్లో కూర్చుంటే ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. ఆస్పత్రికి ఎంత త్వరగా వెళ్తే అంత మంచిది. ఫీవర్ సర్వేలో జ్వర పీడితులను గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్ఓ, మేడ్చల్ జిల్లా

అత్యధిక కేసులు ఇక్కడే..

జీహెచ్ఎంసీ సర్కిళ్లు, పురపాలక సంఘాల్లో అత్యధిక డెంగీ కేసులు నమోదవుతున్నాయి. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ వంటి రోగాలు తీవ్రంగా ప్రబలుతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చిన్న, పెద్ద పరిశ్రమలతో పాటు ఉపాధి మెండుగా ఉండటంతో వలస ప్రజలు కూడా అధికంగా నివస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రులు పరీక్షలు, వైద్య సేవల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నాయి.

వ్యాధులు ప్రబలేందుకు..

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతం ఉండటంతో పాటు కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలో బస్తీలతో పాటు బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడ్చల్ మున్సిపల్ పట్టణాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, చెత్తాచెదారంతో దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. వాటి నివారణకు ఫాగింగ్ యంత్రాలతో పొగ వెదజల్లకపోవడంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారు. పురపాలికల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే అయినా పట్టించుకోవడం లేదు. గ్రామికవాడల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, కాలుష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రతాపరెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, స్వప్న దంపతుల కూతురు అమూల్యరెడ్డి-రాజేశ్వర్‌రెడ్డి వివాహం అవుషాపూర్‌లోని రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. నూతన వధూవరులను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, మా జీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రేవంత్‌రెడ్డి టీం సభ్యుడు శ్రీ కాంత్‌రెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బద్దం జైపాల్‌రె డ్డి, బద్దం మిత్రారెడ్డి, బద్దం మంజుల, బద్దం జ్యోతి ఆశీర్వదించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: అర్హులైన ప్రతి పేదవాడు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన బోడుప్పల్ సూరజ్‌నగర్ కాలనీకి చెందిన వినోద్‌కుమార్‌కు రూ. 27 వేలు, జవహర్‌నగర్‌కు చెందిన లక్ష్మికి రూ. 42 వేలు చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



అరెస్టు అయిన సమీర్, స్వాధీనం చేసుకున్న గంజాయి

మల్కాజిగిరి: ఔరంగాబాద్ నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన సమీర్ వాంగ్మేర్ (19) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ శ్రీకృష్ణనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలాజీ ఫంక్షన్‌హాల్ వద్ద సమీర్ వాంగ్మేర్‌తోపాటు మరొక బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కిలో గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని సమీర్‌ను రిమాండ్‌కు తరలించారు. గతంలో ఎవరికైనా గంజాయి విక్రయించారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

నాలా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న మారుతీనగర్, శ్రీనిధి నెస్ట్ కాలనీవాసులు

ఘట్‌కేసర్: పట్టణంలోని మారుతీనగర్, శ్రీనిధి నెస్ట్ కాలనీ ఈద్గా సమీపంలో ఉన్న సీలింగ్ భూమిలోని నాలాను పూడ్చివేసి ఆక్రమించి నిర్మిస్తున్న కట్టడాలను అడ్డుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీకి బుధవారం పలువురు స్థానికులు వినతిపత్రం అందజేశారు. కాలనీలోకి రాకపోకలు సాగించే రోడ్డును ఆక్రమించడంతో ఇబ్బందులు తలెత్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిత్తారియాదవ్, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కౌన్సిలర్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ చెక్కులు అందజేశారు. లబ్ధిదారులు కొల్లి వెంకాయమ్మకు రూ.60 వేలు, శివకుమార్ రూ.11,500, చంద్రకళ రూ.28,500, ఎండీ అయూబ్ రూ.54 వేలు, మహేశ్‌కు రూ.9 వేల చెక్కులను మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు అమరం జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్ రెడ్డి అందజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి: ఎమ్మెల్యే



ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజనీరింగ్ విద్యలో అడుగుపెడుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, సమయపాలన పాటించాలని, అప్పుడే తమ లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమవుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్, మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నేటి తరం విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోహించవచ్చన్నారు. స్కిల్‌సాఫ్ట్ సంస్థ హెచ్‌ఆర్ సీతారాం, మల్లారెడ్డి గ్రూప్స్ డైరెక్టర్ శాలినీరెడ్డి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, డీన్ ఉదయభాస్కర్, మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మల్లారెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థుల నృత్యాలు

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలోని గత మూడు రోజులుగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగవైభవంగా కొనసాగుతోంది. బుధవారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 12వ డివిజన్‌లో నిర్మించిన పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంవైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ శాంతికోటేష్‌గౌడ్, కార్పొరేటర్ సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, బల్లి శ్రీను, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలో 'స్పేస్ ఆన్ వీల్స్'



జగ్గగూడలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా జగ్గంగూడలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) ఆధ్వర్యంలో స్పేస్ ఆన్ వీల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న పురోగతిపట్ల గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. శాస్త్రీయ వైఖరిని పెంపొందించడం, అంతరిక్షంపట్ల మక్కువ కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఇస్రో శాస్త్రవేత్త ఆరీఫ్ బాబా సాహెబ్ తెలిపారు. అనంతరం వివిధ ఉపగ్రహాలు, వాహక నౌకల నమూనాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ, అకాడమిక్ కో ఆర్డినేటర్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు, ఇస్రో ప్రతినిధులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన అభయాంజనేయ ఆలయం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, శివారెడ్డి

ఉప్పల్: ఉప్పల్ అభయాంజనేయ స్వామి ఆలయంలో గత మూడు రోజులు నిర్వహిస్తున్న స్వామి వారి కళావరోహణపురస్సర కార్యక్రమం భక్తుల తాకిడితో బుధవారం కిటకిటలాడింది. వందలాది భక్తులు వచ్చి స్వామివారి హోమాన్ని కనులార తిలకించారు. దేవాలయం నిర్మాణంలో ఉన్నందున గత కొన్ని నెలలు స్వామి దర్శనాలను ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకులు నిలిపివేశారు. ఆలయ నిర్మాణం పూర్తవ్వగానే గత సోమవారం నుంచి ఆలయ పునఃప్రారంభ వేడుకలు, విగ్రహా ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో స్వామి వారి దర్శనానికి వీఐపీల తాకిడి పెరిగింది. బుధవారం స్వామి వారికి ఉదయం ఆరుగంటల నుంచే సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గర్తన్యాస, కళావరోహణాంగ అష్టోత్తర సహస్ర మూలమంత్రం హోమం, యంత్ర ప్రతిష్ఠ, స్వామి వారి శివ పంచాయతన ప్రతిష్ఠ, సుబ్రమణ్య స్వామి ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడి నిర్మాణానికి నిధులు ఇచ్చిన సంతోష్ నందా దంపతులు స్వామి వారికి ప్రత్యేపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకులు, ఈవో భాగ్యలక్ష్మి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జట్టు



అల్వాల్: మహబూబ్‌నగర్‌లో జరిగిన ఐదో రాష్ట్ర అండర్-16 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా 17 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జట్లు తలపడ్డాయి. రెండు పాయింట్ల తేడాతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విజయం సాధించింది. ఈ సందర్భంగా తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మల్ ఇసాక్ జట్టు కోచ్ శ్రీధర్, జట్టుసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్, ఉపాధ్యాయులు రవి, పరిశీలకులు విశాల్ తదితరులు పాల్గొన్నారు.